క్లుప్తంగా

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 17 మందికి కొవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 15 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : మదీనాగూడ, పాపిరెడ్డి సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- మార్కెట్ ఫీడర్ పరిధిలో ..ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రేమ్‌నగర్ వెనక వైపు, రోలింగ్ మిడోస్, సీఎం తోట వైపు, 100 ఫీట్ రోడ్డు ఇరువైపులా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.
- ఆల్విన్ కాలనీ పరిధిలో.. మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సాయంత్రం 05.00 గంటల వరకు ల్యాండ్ మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసిరాం చాంబర్స్, నైమిషా అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్, శ్రీరాంనగర్ బి బ్లాక్, మధ్యాహ్నం 1 గంటల నుంచి 3 గంటల వరకు జాగృతి కాలనీ, అనంద్‌నగర్, శ్రీనివాస కాలనీ, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొండాపూర్ సిగ్నల్, కొండాపూర్ ప్రధాన రహదారి పరిసరాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

జయభేరి ఫీడర్ పరిధిలో..

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, రాడిసన్ హోటల్, డాగ్ పార్క్ పరిసరాలు, లీ మెరీడియన్ హోటల్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జేవీ కాలనీ, కేంద్రీయ విహార్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్ : కేంద్రీయ విహార్, మయూరినగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కేంద్రీయ విహార్ ఫీడర్ పరిధిలోని.. మయూరినగర్ పార్ట్ ఎస్‌బీఐ బ్యాంక్ లైన్, కొలంబస్ స్కూల్, కేంద్రీయ విహార్, అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మయూరినగర్ ఫీడర్ పరిధిలోని ఓల్డేజ్ హోం అపోజిట్ ఏరియా, ఎస్‌బీఐ బ్యాంకు లైన్, మయూరినగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్ తెలిపారు.

కాళీమాత ఆలయంలో శ్రావణ పూజలు



కాళీమాత సన్నిధిలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని నానక్‌రాంగూడలోని కాళీమాత ఆలయంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకారం చేశారు. నానక్‌రాంగూడలోని కాళీమాత ఆలయంలో శ్రావణమాస పూజల్లో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, శివాసింగ్, ప్రకాశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సర్కిల్ –21 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంతిని మంగళవారం కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ రోడ్డులో కల్వర్టు పనులు, తారానగర్, ఇంద్రానగర్ శ్మశానవాటిక పనులను, వేమన కాలనీలోని ఎస్టీపీ పనులు వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఈఈ శ్రీకాంతికి వివరిస్తున్న కార్పొరేటర్ మంజుల



మాదాపూర్ చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో నిర్వహించిన ఫొటో ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకుంటున్న అరుదైన చిత్రాలు


చిత్రం చెప్పే 'స్వాతంత్ర్యం'

చిత్రమయి స్టేట్‌ఆర్ట్ గ్యాలరీలో మేరి మాటి–మేరా దేశ్ చిత్ర ప్రదర్శన

మాదాపూర్: నేటి స్వేచ్ఛ.. స్వాతంత్రం నాటి త్యాగధనుల ప్రతిఫలమే. అలాంటి సమర యోధుల చరిత్రను వివరించే విధంగా మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో చిత్రప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను సెంట్రల్ బ్యూరోఆఫ్ కమ్యూనికేషన్, చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. మేరి మాటి–మేరా దేశ్ పేరిట ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు.



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు



చిన్నారులకు సమరయోధులు తెలియదు



మహనీయుల త్యాగఫలం వల్లనే స్వాతంత్ర్యం వచ్చిందని సమయం ఉన్నప్పుడల్లా చిన్నారులకు చెప్పాలి. ఫొటోలతో సహా చూపించి వారి గొప్పతనాన్ని వివరించినప్పుడే చిన్నారులకు శాశ్వతంగా గుర్తుంటుంది. దీని వల్ల మంచి నడవడిక, సామాజిక బాధ్యత, పెద్దలపట్ల గౌరవం పెరుగుతాయి. దీంతో మంచి నడవడికతో పెరుగుతారు.

–సారా, సందర్శకురాలు

రోజు ఒక సమరయోధుడి గాథ వినిపించాలి



పాఠశాలలో కనీసం 20 నిమిషాలు ప్రతి రోజు ఒక సమరయోధుని గురించి చెప్పాలి. లక్ష్యసాధన కోసం చేసిన కృషి, పట్టుదల, చేసిన త్యాగాలు, గుర్తు చేయాలి. పూర్వ రాజకీయాలు, నేటి రాజకీయాలకు ఉన్న వ్యత్యాసాలను వివరించాలి.

–భగీరథ, సందర్శకురాలు

అందరికీ తెలియాలనే లక్ష్యంతో..



ఫొటోగ్రాఫర్ కుల్వంత్‌రాయ్ (1914–1984) మధ్య కాలంలో తీసిన ఫొటోలు అరుదైన చిత్రాలు. సమావేశాల సమయంలో, అప్పటి దేశ పరిస్థితులను తెలిపే విధంగా అరుదైన చిత్రాలు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి ప్రదర్శనను ప్రతి ఒక్కరు తిలకించాలి. ఈ ప్రదర్శన సెప్టెంబర్ 5వ తేదీ వరకు ఉంటుంది. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు సందర్శించవచ్చు.

–యాక్విన్, నిర్వాహకుడు

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే గాంధీ



గచ్చిబౌలి: సీఎం కేసీఆర్‌ను ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు.

అభినందనల వెల్లువ

శేరిలింగంపల్లి: బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆరికెపూడి గాంధీని ప్రకటించడంతో మంగళవారం సైబర్ ఎన్‌క్లేవ్, సాయినగర్, నవోదయ కాలనీ, శ్రీకృష్ణ కాలనీవాసులు నల్లగండ్ల హుడా కాలనీ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో కలిసి అభినందనలు తెలిపారు. భారీ పూలమాలతో సన్మానించారు.

గచ్చిబౌలి: ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఇంటి వద్ద మంగళవారం కూడా కోలాహలం నెలకొంది. శేరిలింగంపల్లిలోని వివిధ డివిజన్ల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకొని ఆయనకు అభినందనలు తెలిపారు.

పారామెడిక్స్ పాత్ర కీలకం

రాయదుర్గం: సమాజంలో పారా మెడిక్స్ ముఖ్యమైన పాత్ర పోషిస్తారని బెంగళూరు సెయింట్ జాన్స్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ తుప్పిల్ వెంకటేష్ పేర్కొన్నారు. మనూలో ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ ఇండియా (ఎఫ్‌క్యూఐ), స్కూల్ ఆఫ్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం 'అవేర్‌నెస్ ఆఫ్ క్వాలిటీ కంట్రోల్ ఇన్ మెడికల్ లాబొరేటరీస్' అనే అంశంపై బ్యాచులర్ ఆఫ్ ఒకేషనల్ మెడికల్ లేబరేటరీ విద్యార్థులకు ఒకరోజు ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారా మెడిక్స్ అనే వారు టెక్నాలజిస్ట్స్, వైద్యుల మధ్య వారధిగా వ్యవహరిస్తారన్నారు.

జేఎన్‌వీలో 'మేరీ మాటి.. మేరా దేశ్–2023'



గోపన్‌పల్లి జేఎన్‌వీలో.. కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్న విద్యార్థులు

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా ప్రాంగణంలో అట్టహాసంగా 'మేరీ మాటి మేరా దేశ్–2023' కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం గోపన్‌పల్లిలోని జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లా ప్రాంగణంలో ప్రిన్సిపల్ విజయభాస్కర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'దళిత, బీసీబంధు' అంటూ మోసం



గంగారంలో ప్రచారం చేస్తున్న రవికుమార్ యాదవ్ ,నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : దళిత, బీసీ బంధులంటూ ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దించే రోజులు దగ్గరపడ్డాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారంలో గడపగడపకు రవన్న ప్రజాయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 9 సంవత్సరాల నుంచి కల్లిబొల్లి మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గంగారం గ్రామంలో వీధిలైట్లు లేక, సరైన రోడ్లు లేక అవస్థలు పడుతున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే యుద్ధ ప్రాతిపదికన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ప్రజాయాత్రలో బీజేపీ నాయకులు దేవాల్ యాదవ్, రాజేష్, కౌశిక్, రాజు, మహేష్ బాబు, అశోక్, నందు, నరసింహ, సురేష్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

ఎన్నికలు.. ప్రణాళికబద్ధమైన కార్యాచరణ అవసరం

సమన్వయ సమావేశంలో ఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో ఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డి, మాదాపూర్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి తదితరులు

గచ్చిబౌలి: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని శేరిలింగంపల్లి ఆర్ఓ, వెస్ట్ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం –52లో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గమైన శేరిలింగంపల్లిలో వచ్చే ఎన్నికల నిర్వహణకు ప్రణాళికబద్ధమైన కార్యాచరణ అవసరమని ఆయన పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం–52లో 6.62 లక్షల మంది ఓటర్లు ,192 భవనాలు, 623 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఏఆర్‌ఓలు, ఈ ఆర్‌వో, నోడల్ అధికారులు నిర్వహించే విధులపై అందరు అవగాహన ఏర్పరుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ ఎన్.నర్సింహారెడ్డి, మియాపూర్ ఏసీపీ పి.నర్సింహారావు, సీఐలు జేమ్స్ బాబు, పాలవెల్లి, ఈఆర్‌ఓ రజనీకాంత్‌రెడ్డి, ఎస్ఈ శంకర్, చందానగర్ డీసీ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై డీసీ సమీక్ష సమావేశం

హఫీజ్‌పేట్ : చందానగర్ సర్కిల్ –21 కార్యాలయంలో శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బందితో మంగళవారం ఉపకమిషనర్ వంశీకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీసీ వంశీకృష్ణ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, ప్రధాన రోడ్లు, బస్తీలలో పారిశుద్ధ్యం పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పారిశుధ్య కార్మికులు సమయ పాలన పాటించాలన్నారు. రోడ్ల పక్కన చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో, రోడ్లపై చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలతో పాటు బ్యానర్లు ఏర్పాటుతో పాటు ముగ్గులు వేయాలన్నారు. చెత్త కుప్పలు పేరుకుపోయే ప్రాంతాలలోని క్షేత్రస్థాయి సిబ్బందిపై, విధులలో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్ కార్తీక్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.



చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో డీసీ వంశీకృష్ణ

సమస్యలు పరిష్కరించాలని హోంగార్డుల వినతి

రాయదుర్గం: తెలంగాణ ప్రభుత్వ సలహాదారు సోమేష్‌కుమార్‌కు సమస్యలపై వినతిపత్రాన్ని అందించినట్లు సైబరాబాద్ హోంగార్డుల అధ్యక్షుడు అశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. దక్షిణ భారత ప్రతినిధి డాక్టర్ కొత్వాల్ దయానంద్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు హరిబాబు, మన్మధరావు, తిరుపతి, కుమార్‌తో కలసి వినతిపత్రం అందించామన్నారు. తెలంగాణ రాష్ట్ర హోంగార్డులను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, చనిపోయిన కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్డ్ అయిన హోంగార్డులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని వినతిపత్రంలో కోరినట్లు పేర్కొన్నారు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

స్నానానికి కుంటలో దిగి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: స్నానానికి కుంటలోకి దిగి ఓ వ్యక్తి మునిగిపోయాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. ఇస్నాపూర్ అంబేద్కర్ కాలనీకి చెందిన రవి(41) డ్రైవర్. ఈ నెల 19వ తేదీ ఉదయం రవి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా సోమవారం సాయంత్రం ఇస్నాపూర్ గ్రామంలోని సంగమేష్‌కు కుంట ఒడ్డున బట్టలు కనిపించాయి.సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి చూసి రవిగా గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

మియాపూర్ : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో యువకుడు కిందపడి గాయాలపాలై మృతిచెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం... చందానగర్‌లోని కాంతినగర్‌కి చెందిన బి.బాలాజీకి ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమారుడు సంతోష్(24) స్థానికంగా ఆటోమొబైల్ షాపులో పనిచేస్తున్నాడు. ఈ నెల 20న ఆదివారం ఉదయం సంతోష్ స్నేహితుడిని కలిసేందుకని ప్యాషన్ ప్రో వాహనంపై వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా మియాపూర్ మదీనాగూడలోని బజాజ్ ఎలక్ట్రానిక్ ముందు యూ టర్న్ తీసుకుంటుండగా చందానగర్ నుంచి మియాపూర్ వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం సంతోష్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇరువురు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు దగ్గర్లో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం సంతోష్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సంతోష్ సోమవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సంతోష్ మృతికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మృతుడు సంతోష్ తండ్రి బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గోడ కూలి.. తాపీ మేస్త్రీ ..

హఫీజ్‌పేట్ : ప్రమాదవశాత్తు ఓ తాపీ మేస్త్రీ మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రఘు తెలిపిన ప్రకారం.. కేపీహెచ్‌బి కాలనీలోని ఎల్ఐజీ 4ఫేజ్‌లో నివాసముండే చందోలు జై చంద్రారావు (46) తాపి మేస్త్రీ. మంగళవారం చందానగర్ పాపిరెడ్డి కాలనీలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు గోడ కూలింది. తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్త ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చంద్రారావు మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుమారుడు దేవి ప్రసాద్ ఫిర్యాదు మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి జయంతి



వెంకట రామారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

హఫీజ్‌పేట్ : రాజాబహద్దూర్ పాశం వెంకట రామారెడ్డి జయంతి వేడుకలు శేరిలింగంపల్లి రెడ్డి సంఘం అధ్యక్షులు నల్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వెంకట రామారెడ్డి జీవిత చరిత్ర, సాధించిన ఘనత, ధైర్య సాహసాల గురించి వివరించారు. వెంకట రామారెడ్డి పలు సంస్థలను పోషించారన్నారు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, వేమనాంధ్ర భాషా నిలయం, బాల సరస్వతి గ్రంథాలయం పురోభివృద్ధికి సహాయమందించారన్నారు. హైదరాబాద్‌లో రెడ్డి విద్యార్థి వసతిగృహం నెలకొల్పారన్నారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అశోక్, చినబాబు, మస్తాన్, నల్ల రాజిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, జయేందర్‌రెడ్డి, జ్యోతిరెడ్డి, నరసింహారెడ్డి, నాగరాజు, రంజిత్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్, జయపురెడ్డి, మహేశ్వర్ రెడ్డి ,పోరెడ్డి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు సైనికుల్లా పనిచేయాలి



ప్రభాస్ యోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే మునిరత్నంనాయుడు, కొరదాల నరేష్ తదితరులు

కర్ణాటక ఎమ్మెల్యే మునిరత్నంనాయుడు

కూకట్‌పల్లి: ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించే నాయకులతోనే సమాజానికి ఉపయోగం ఉంటుందని కర్ణాటక రాష్ట్రం రాజరాజేశ్వరినగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు అన్నారు. బీజేపీ ప్రభాస్ యోజనలో భాగంగా మంగళవారం వివేకానందనగర్, హైదర్‌నగర్ డివిజన్‌ల పార్టీ కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే మునిరత్నంనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మూడు నెలలు పూర్తి సమయం పార్టీకి కేటాయించి ఒక్కొక్క నాయకుడు 100 ఓట్లు పోలింగ్ బూత్‌లలో వేయించాలని, సైనికుల్లా పనిచేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కొరదాల నరేష్ మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో ప్రతి బూత్‌లో బలమైన నాయకత్వం ఉండాలని, ఓటర్ లిస్టుపై ఆ బూత్‌ను చూసే నాయకులకు అవగాహన ఉండాలన్నారు. ప్రతి ఒక్క ఓటర్‌ను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌చార్జి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జానకి రామరాజు, సత్యనారాయణ, రవీందర్‌రావు, రాఘవేంద్రరావు, మణిభూషణ చారి, నవీన్‌గౌడ్, నర్సింగ్‌రావు, అరుణ్, వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న కూలీలు, కాంట్రాక్టర్లు

హఫీజ్‌పేట్ : ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ తమకు ఇవ్వాల్సిన బిల్లులు చెల్లించడం లేదని మంగళవారం కాంట్రాక్టర్లు, కూలీలు ఆందోళన చేపట్టారు. ఇందులో లేబర్ కాంటాక్ట్ తీసుకున్న సాయి తిరుమల కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు మేనేజర్ కృష్ణ మాట్లాడుతూ మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ సర్వే నంబర్ 78, 80లో 8 ఎకరాలలో ఆదిత్య కన్‌స్ట్రక్షన్ కంపెనీ బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టిందని ఇందులో లేబర్ కాంటాక్ట్ తీసుకున్న తమకు ఏళ్ళ తరబడి బిల్లులు ఇవ్వడం లేదని, బిల్లులు అడిగేందుకు వచ్చిన తమపై బౌన్సర్లతో దాడి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.50 కోట్లు మేర పెట్టుబడులు పెట్టి నిర్మాణాలు చేపట్టామన్నారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని వాపోయారు. త్వరగా తమకు బిల్లులు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మియాపూర్: జాతీయ రహదారి దాటుతున్న ఓ వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేసుకుంది. ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా దేవునిపల్లి గ్రామానికి చెందిన సంగయ్య (45) కుటుంబ సభ్యులతో కలిసి గత 5 సంవత్సరాల క్రిందట నగరానికి వచ్చి మియాపూర్ మాతృశ్రీనగర్ కాలనీలో నివాసముంటున్నారు. సంగయ్య భార్య ఇళ్లల్లో పనిచేస్తుండగా సంగయ్య కూలీపనులు చేస్తూ.. జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 19న ఉదయం 9 గంటలకు సంగయ్య పనులకు వెళ్లి ఇంటికి వచ్చే క్రమంలో మియాపూర్‌లోని న్యూ కాలనీ శివాలయం నుండి మాతృశ్రీనగర్ కాలనీ వైపు జాతీయ రహదారి దాటుతుండగా కూకట్‌పల్లి నుంచి లింగంపల్లి వెళ్తున్న బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు దగ్గరలో ఉన్న ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయాలపాలైన సంగయ్యను గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుమారుడు మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.